# కన్నీళ్లు

సడ్లపల్లె చిదంబరరెడ్డి

**కూ**తురు అల్లుడు ఆటో ఎక్కి కనుమరుగైపోయినా కూడా నా బరువెక్కిన మనసు కాసంతయినా తేలికపడలేదు.

గేటు వేసి ఇంట్లోకి అడుగుపెట్టాను. సమయం ఉదయం పదకొండుగంటలు కావస్తూంది. ఉన్నది ఒక్కదాన్ని. అన్నం తినేశాక వేరే ఏం పనుంటుంది! అనాలోచితంగా పేపరు తిరగేయబోతే మనసులో అలజడి మరికాస్త పెరగసాగింది.

ఇక లాభం లేదనుకొని పెరటి తోటకేసి నడిచాను.

తననెత్తుకొమ్మని చిన్నారిపాప కాళ్లూ చేతులూ ఆడిస్తూ మూగగా మారాం చేసినట్లు మాటలకందని మమతలతో, బోసినవ్వుల పువ్వులతో - రోజూ కదలాడే చెట్లు తల్లిప్రేమకు దూరమైన అనాధ శిశువుల్లా వాడిపోయి తలలు వేలాడేసుకున్నాయి.

వాటిని చూస్తూనే నా మనసు కలుక్కుమంది. అసలే వానలు రాక ఎండలు కురిసే రాయలసీమ. కూతురు, అల్లుడి గొడవల్లో పడి వాటి సంగతే మరిచిపోయాను. వాటికి నీళ్ల పట్టి మూడురోజులైంది.

సాయంత్రం తప్పకుండ పట్టాలని నిర్ణయించుకొని ఓ పాదు దగ్గర కూర్చున్నాను.

పదిరోజులైనా కాలేదు శుభ్రం చేయించి, అప్పుడే గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి. అదే పనిగా నాటి, ఎరువులు వేసి, నీరుపోసి పెంచే మొక్కలకు లేని ఏపు కలుపుకెలా వస్తుంది? అని నాలో నేను తర్కించుకొంటు చేతికందిన కలుపుమొక్కలు లాగేస్తున్నాను.

అంతలో ఏదో చేతికి భగ్గున తగిలినట్లయితే చూసుకున్నాను. చూపుడు వేలు చించుకుపోయి రక్తం కారసాగింది.

వేలు మండిపోతూంటే, కారే రక్తాన్ని ఆపడానికి ప్రయత్నించలేదు. ఎందుకంటే నాలో బాధో, అసహనమో ఫలానా అని చెప్పలేని మనోభారం పెరిగిపోతూవుంది.

మనసును మెదడును చితికిపోయేలా ఒత్తిడి చేసే ఆ భారం 'బరువు' ఎంతో తెలియదు కాని అది ఆవేశించింది మాత్రం నా పెళ్లి రోజే అయివుంటుంది.

అంతవరకూ కష్టం, సుఖం, మంచీ చెడూ తెలియకుండా పెరిగిన నేను నాన్నగారు ప్రజానాయకుడిగా వల్లించే సేవాభావం, మతసామరస్యం, ఆదర్శవాదాలంటే చెవికోసుకునేదాన్ని. వాటిని అభిమానించడమే కాక ఆచరించి నాన్నగారి కీర్తి ద్విగుణీకృతం చేద్దామనే ఉబలాటంతో ప్రేమించిన వ్యక్తిని పెళ్లాడి ఇంటికి వస్తే 'ఆస్తి అంతస్తులు లేని వానితో మతాంతర వివాహమా?' అంటూ నన్ను గొడ్డులా బాది మెడబట్టి బయటికి గెంటించాడు.

కలలో కూడా ఊహించని నాన్న ప్రవర్తనకు నిలువునా కంపించిపోయాను.

అమ్మ, తమ్ముడు, చెల్లాయి నా దీనావస్థకు బోరున ఏడుస్తుంటే నాలో నుండి ఉప్పెనలాంటి ఏడ్పు తన్నుకు వచ్చినట్లయి గట్టిగా వారితో పాటు ఏడ్వబోయాను. కాని మరుక్షణం ఏమయ్యిందో నాకే తెలియదు.

స్పృహ వచ్చేసరికి ఆస్పత్రిలో ఉన్నాను. ఎదురుగా కట్టుకున్న వాడేగాని, కావలసిన మరెవ్వరూ కనిపించలేదు. శూన్యంలోకి చూస్తున్నంతలో డాక్టరు గారొచ్చారు.



"మరేం పరవాలేదమ్మా సమస్యలు రావడం ప్రతిమనిషికి సహజం. మీ మట్టుకు సమస్యలు వచ్చినప్పుడు తీవ్రంగా ఆలోచించకండి. కన్నీరు కాలువలు గట్టేలా తనివితీర ఏడ్వండి. ఆ కన్నీరే మీ మనసును తేలికపరుస్తుంది. నవ్వులు ఏడ్పులే మనిషి మనసుకు వ్యాయామం లాంటివి" అని చెప్పి ఏవో కొన్ని మాత్రలు రాసిచ్చాడు.

డాక్టరు గారి మాటలకు అంత విషాదంలోనూ నవ్వు వచ్చిందిగాని, నవ్వే ఓపిక లేక మూగగా ఉండిపోయాను.

* * *

నాకైతే పెద్ద ప్రయత్నం లేకుండానే ఉద్యోగం దొరికిందిగాని, మావారు మాత్రం తనకంటూ ఒక వ్యాపకం అవసరమని గుర్తించలేదు. కొద్దిరోజుల్లోనే నన్నుగాక నేను తెచ్చే జీతాన్నే ఎక్కువగా ప్రేమించడం మొదలు పెట్టాడు.

చిన్నప్పట్నుంచి నేను పగలబడి అదే పనిగా నవ్విన సంఘటనలుకాని, బాధతో ఏడ్చిన సన్నివేశాలు కాని గుర్తుకు లేవు కాని, డాక్టరుగారు చెప్పినప్పట్నుంచి నవ్వడం అటుంచి హృదయం బరువెక్కినప్పుడల్లా ఏడ్చి కాస్త ఊరట చెందాలని ఎంతగానో ప్రయత్నించాను -

పేదరాశి పెద్దమ్మ కథల్లో రాకుమారుడిని- అన్ని దిక్కులకూ వెళ్లు, ఉత్తరదిక్కుకు మాత్రం వెళ్లవద్దంటే - వాడు ఉద్దేశ్యపూర్వకంగా ఉత్తరదిక్కుకే వెళ్లి ఆపదలు కొనితెచ్చుకున్నట్లు నా మనసు కూడా కావాలన్న కన్నీటి ధారలకు దూరమైపోతూవుంది.

చివరకు ప్రేమించి పెళ్లి చేసుకున్నవాడు తాగుడుకు బానిసై ముప్పయి ఏళ్లకే వైధవ్యం ప్రసాదిస్తే, అయినవాళ్ళూ, కాని వాళ్ళూ కుమిలికుమిలి ఏడుస్తూ నాపై సానుభూతి కురిపిస్తుంటే - నిట్టూర్పులతో నిలువు గుడ్లేసుకొని కూలబడ్డం తప్ప నా కళ్లకు తడి అంటలేదు.

అందరూ నన్ను బండమనిషన్నారు. హృదయం లేని కసాయిదన్నారు. నిజమేనా? నాకు హృదయం లేదా?! లేక దాన్ని కరిగించి కరుణరసాన్ని చిలికించేవారు తారసపడ్డం లేదా? ఈ రెండింటిలో ఏది నిజం!! అదే నాకు తేలడం లేదు.

కనీసం ఉన్నది ఒక్కగానొక్క కూతురు. అద్దైనా నా గుండెల్లో పేరుకుపోతున్న పెనుభారాన్ని తగ్గిస్తుందని ఆశిస్తే నిరాశలే మిగిల్చింది.

అది - దాని భర్త ఇద్దరూ ఉద్యోగులే. వారికి డబ్బులు తప్ప మనుష్యులు కనిపించరు. అగుపించిన ప్రతిదీ సొంతం చేసుకోవాలనే ఆరాటం. ఎన్ని సైట్లు కొన్నా, ఎన్ని షేర్లు కొన్నా, ఎంతబంగారం కొన్నా వారికి తృప్తే ఉండదు.

ఒక జంతువు చచ్చి కంపు కొడితే గాని దాన్ని తినడానికి రాబందులు రావంటారు. నా చేతికింత డబ్బు వస్తుందని ఎలా పసిగడతారో గాని నక్షత్రకుల్లా దాపురిస్తారు. ఫ్రిజ్ కొనాలని, వి.సి.ఆర్.

**ముడతలు పడిన నల్లని శరీరం. నెరిసిన తల, మాసిన గడ్డం ఎండలో నడిచి ముఖమంతా చెమట్లు పట్టినట్టున్నాయి. తలగుడ్డ తీసి చెమటను ఒక చేత్తో తుడుచుకొంటూ మరో చేత్తో పికాసి పట్టుకున్నాడు.....**



తేవాలని, చీర నేయించాలని గద్దల్లా తన్నుకుపోతారు.

నా భావం, ముసలితనం, ఒంటరితనం ఏదీ వారికి కాబట్టదు.

ఇవ్వనని మొండికేస్తే ఒక్కటే ఏడ్పులు, పెడబొబ్బలు. దాని ఏడ్పులు చూస్తే నాకు అసహ్యం. ఒళ్లుమంట. అసలు ఏడ్పు ఇంత అసహ్యంగా ఉంటుందని నా మనసు పొరల్లో చేరిపోవడం వల్లనే నేను మనసారా ఏడ్వలేకపోతున్నానేమో అనికూడా అనిపిస్తుంది.

పి.ఎఫ్. తాలూకు వచ్చిన డబ్బుల కోసమని వచ్చి మూన్నాళ్లుగా పీకలమీద కూర్చున్నారు. కనీసం నా ఆరోగ్యం గురించి విచారించే తీరికకూడా లేక నన్ను అసహనానికి గురిచేసి లాక్కుపోయారు.

అందుకే కారని కన్నీటిని వదిలేసి కారే రక్తంతో అయినా మనసును తేలిక పరచుకుందామనుకున్నాను గాని, ఫలితం లభించలేదు.

మెల్లగా లేచి చేతికయిన రక్తం మరకలు కడుక్కుంటున్నాను.

"తోట్లో ఏమైనా పనుందా అమ్మా" అని ఎవరో అడిగినట్లయితే ఆ వైపు తిరిగాను.

ముడతలు పడిన నల్లని శరీరం. నెరిసిన తల, మాసిన గడ్డం ఎండలో నడిచి ముఖమంతా చెమట్లు పట్టినట్టున్నాయి. తలగుడ్డ తీసి చెమటను ఒక చేత్తో తుడుచుకొంటూ మరో చేత్తో పికాసి పట్టుకున్నాడు.

అరవై ఏళ్లు పైబడి ఉంటాయి. నా జవాబు కోసం నిరీక్షిస్తున్న అతని కళ్లలో చూపులకన్న దైన్యం, ఆర్ధింపులే తొంగి చూస్తున్నాయి.

శ్రమ చేసిన శరీరం వడలిపోయి వంగిపోయింది. ఇంకా కష్టం కోసం వెతుకుతున్నాడంటే అతని స్థితి ఎంత దయనీయంగా ఉందో కదా అనిపించింది.

అతడు తోటపని చేయకపోయినా ఏదయినా ఇంత సాయం చేద్దామనిపించింది. 'సరే' అంటూ రమ్మన్నాను.

అతడు తొడుక్కున్న అంగీలో మెడపట్టీ మాత్రమే గట్టిగా ఉంది. భుజాల మీద, వీపు మీద చిరిగి వేలాడుతూ మరకలు గట్టింది. దాన్ని అతి జాగ్రత్తగా విప్పి మడతపెట్టి ఒకచోట పెట్టాడు. పంచెను మొలదాకా ఎగగట్టుకున్నాడు. పోగులు దేలిన పొడుగాటి గుడ్డను తలకు చుట్టుకున్నాడు.

ఎముకలు, వాటికంటుకున్న ఎండిన చర్మం తప్ప ఆ శరీరంలో రక్తమాంసాలు ఉన్నట్లు తోచదు. పని ప్రారంభిస్తూ "ఇంత సద్ది ఉంటే పెట్టు తల్లీ" అంటూ చేతి వేళ్లను పిడికిలిగా మడిచి చూపాడు.

"అయ్యో" అనిపించి లోపలికి నడిచాను.

పొద్దున వండిన అన్నము, కూర ఏదీ మిగల్లేదు. రాత్రికి ఏదయినా నాకూ చేసుకోవాల్సిందే అని బుట్టని గాలిస్తే రెండు వంకాయలు, ఒక టమాటో, పట్టెడు బీన్సు, మిరపకాయలు కనిపించాయి. వాటితో ఏమి చేయాలో పాలుపోక బియ్యం కడిగి కందిపప్పు కలిపి ఎసరు పెట్టి, ఉన్న కూరగాయలన్నీ తరిగేసి తిరగబాతేసి ఉడకబెట్టేంతలో ఎవరో తలుపు తట్టినట్లయితే వెళ్లి తలుపు తీశాను.

" నమస్తే మేడం" అంటు ముఖమంతా నవ్వులు పులుముకొని లోపలికొచ్చాడు నేను పనిచేసిన ఆఫీసులో పనిచేస్తున్న గుమాస్తా గోపాలం.

'ఎందు'కని అడక్కుండానే మొదలు పెట్టాడు –" కనీసం వెయ్యిరూపాయలయినా ఇచ్చే దొడ్డబుద్ధి తమదని ఫైళ్లన్నీ త్వర త్వరగా కదిలించి పి.ఎఫ్. డబ్బులు తెప్పిస్తే ఐదొందలే ఇచ్చి పంపారు గద తల్లీ...." అని భృత్యానుభృత్యుడై నవ్వులు నటిస్తూ దోపిడీ చేసే బెగ్గర్‌పై భద్రకాళిలా లంఘించి ఒళ్లంతా చీరేద్దామనిపించింది గాని పాము బుసలకన్న క్రూరమైన వాడి ముఖంలోని నవ్వులకు ఒళ్లంతా జలదరించి, అసహ్యం వేసి చేతి సంచిలో దొరికిన నోట్లు తీసి ముఖంపై కొట్టాను.

నేల పడిన నోట్లను గబగబా ఏరుకొని దొంగ కుక్కలా వెళ్లిపోయాడు.

అసహజమైన నవ్వులకు ఏడ్పులకు నాలోని హాస్య కరుణరసాలు మరిగి, ఇగిరి, తరిగిపోయి ఉంటాయి. ఇక వాటి గురించి ఆలోచించగూడదని నిర్ధారించుకున్నంతలో కుక్కర్ శబ్దం వినిపించింది.

స్టౌ ఆర్పేసి తోటలో కెళ్లాను కదా – నా కళ్లను నేను నమ్మలేకపోయాను.

బక్క శరీరంతో ఆ ముసలాయన వేసే ప్రతి ఘాతానికీ భూమి మోకాలి లోతుకు చీరిపోతూ కలుపుకూటేళ్లతో సహా బయట పడుతూవుంది.

గంటలు గంటలు బేరం చేసి డబ్బులు లాక్కొని పైపైనే మెరుగులు పెట్టి పోయే వారినే చూశాను గాని –

ఇంత నైపుణ్యంగా దీక్షగా అంగుళమంగుళమూ తవ్వుతూ వెన్నునుండి వెంట్రుక తీసినట్టు కలుపు ఏరివేస్తుంటే అతని పని తనానికి చేతులెత్తి మొక్కాలనిపించింది. ఆ ఎముకల గూటిలోని శక్తికి జైకొట్టాలనిపించింది.

గబగబా చెంబుతో నీళ్లిచ్చి "పెద్దయ్యా ఇంక చాలు చేతులు కడుక్కో అన్నం తిందువు" అన్నాను.

"పని మధ్యలో ఆపడమెందుకు లేమ్మా"! అంటూ ఓపికగా పాదులు చేసి, చేతులు కడుక్కొని అరిటాకు కోసి పరుచుకొని కూర్చున్నాడు.

పట్టెడన్నం నాకోసం ఉంచుకొని, సారిసారికీ వడ్డించడమెందుకని వండిన దంతా ఆకులో కుమ్మరించేశాను.

భక్తిగా అన్నం కళ్ల కద్దుకొని అతడు తినడం చూస్తుంటే నాలో ఏదో అవ్యక్త ప్రకంపన బయలుదేరినట్లయింది. ఇంట్లోకెళ్లి డబ్బులు తెచ్చి అతనికివ్వబోయాను.

కనీసం అతను డబ్బు వంకైనా చూడలేదు. "ఎక్కడ పనిచేసినా డబ్బులిచ్చి, హోటల్లో తినమనేవారేకానీ, ఈ కాలంలో ఎవ్వరూ అన్నం పెట్టరమ్మా. ఇంత ప్రేమగా, రుచిగా, కడుపునిండా మీరు పెట్టిన అన్నం తల్లిచేతిలో తిన్న అమృతాన్నం లాగుందమ్మా. పాడు డబ్బులు ఏం చేయను తల్లీ?!

నేను సంపాదించిన డబ్బులను, భూములను, నన్ను నా ప్రమేయం లేకుండానే పంచుకో జూచిన కొడుకులంటేనే విసిగిపోయి దూరం వచ్చేశాను.

డబ్బుంటే దాచాలనిపిస్తుంది. దాచుకోవాలంటే ఇల్లు కావాల. ఇల్లంటే మళ్లీ సంసారం ఝంఝాటాలు...వద్దు తల్లీ వద్దు....ఆ ఊసులనుండి విముక్తుడై వచ్చేశాను. ఇంక రెండ్రోజులు నాకాకలుండదు. ఆకలయినప్పుడు మీలాంటి తల్లి దగ్గర ఇంత పనిచేస్తాను...." అని చెబుతున్న ఆ కర్మజీవి తత్వానికి చలించిపోయాను.

కనిపించినదంతా డబ్బుగా మార్చుకునే గబ్బు ప్రపంచం తప్ప మరో మానవ లోకం ఎరుగని నాకు శరీరంలో అణువు అణువులో చలనం మొదలయింది. నిట్టూర్పులు తప్ప ఏమీ ఎరుగని నా హృదయంలో బడబానలం లాంటిది ప్రజ్వలించి వేడెక్కి గొంతుకదాకా పొంగుకు వచ్చింది. కళ్లలో దూరి కన్నీళ్లై కాలవలు గట్టింది. జీవితంలో నిజమైన కన్నీటికై కుమిలి తపించిన నేను ఎంత వెక్కి వెక్కి ఏడ్చానో నాకే తెలియదు.